చినబాబూ! గోదావరి నీళ్లెక్కడ..?

నారా లోకేష్ సేమ్ టు సేమ్ తండ్రికి తగ్గ తనయుడని చాటుకుంటున్నారు. ఇచ్చిన హామీలే ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అటకెక్కించి, దగా చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని ప్రజలకు అనుభవపూర్వకమే. 40 ఇయర్స్ పొలిటికల్ ఇండస్ట్రీ అని గొప్పలు బాబు దాబుతనాన్నీ నారా లోకేష్ వంటపట్టించుకున్నారు. పుంగనూరు పర్యటనలో ఆయన ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయి. హామీలు నమ్మి ఆశలు పెట్టుకున్న పుంగనూరు ప్రజలను నిండా మోసగించారు.



పుంగనూరులో 2015లో నారా లోకేష్‌ను నిలదీస్తున్న మహిళలు (ఫైల్)

- పుంగనూరును సింగపూర్ చేస్తామన్నారు
- దశాబ్ద కాలం నాటి ఎన్నికల హామీలను అటకెక్కించిన వైనం
- అప్పటి రోడ్‌షోలో అంతా ఆర్భాటమేనా?
- ఇప్పుడైనా దృష్టి సారిస్తారా..?



2014లో మాట్లాడుతున్న నారా లోకేష్ (ఫైల్)

పుంగనూరు: 2014 ఏప్రిల్ 17న ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాలోకేష్ పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో రాత్రి ప్రచారం నిర్వహించారు. అప్పట్లో అభ్యర్థిని మార్చడంతో తెలుగుదేశం పార్టీ మరో వర్గం ముష్టి యుద్ధాలకు దిగింది. ఈ సమయంలో నారాలోకేష్ రోడ్‌షోలో ప్రసంగిస్తూ ప్రారంభంలోనే 30 సభల్లో మాట్లాడి గొంతు బొంగురుపోయిందని, సీమాంధ్రలోని అన్ని స్థానాల్లోను తెలుగుదేశం వారినే గెలిపించాలని కోరారు. అలా చేస్తే సీమాంధ్రను సింగపూర్‌ను చేస్తాం... ఆ తరహాలో పుంగనూరును అభివృద్ధి చేస్తాం...లేదంటే ఈ పుంగనూరు జాతీయ రహదారిపై నిలదీయ్యండి అంటూ ఆవేశపూరితంగా మాట్లాడారు. ఆ తర్వాత సీన్ కట్ చేస్తే- అధికారం వచ్చిన ఐదేళ్లలో పుంగనూరు అభివృద్ధిని పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ పాలనలో జాతీయ రహదారిని సుమారు రూ.10 కోట్లు ఖర్చు చేసి రోడ్డును విస్తరించి, ఎల్ఈడీ దీపాలతో సుందరంగా ఏర్పాటు చేశారు.

రెండవ 'సారీ'

2015 ఏప్రిల్ 14న రెండవసారి పుంగనూరులో నారాలోకేష్ పర్యటించారు. మహిళలు లోకేష్‌ను నిలదీశారు. పదినెలలు కావొస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయిస్తారా..? మాటల్లు వేసుకుని మాకే మోసం చేస్తారా..? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేస్తామని అప్పట్లో లోకేష్ ప్రకటించి వారిని శాంతింపజేశారు.

పట్టిసీమను పూర్తిచేస్తాం

ఎవరేమనుకున్నా పట్టిసీమను పూర్తిచేస్తామని రాయలసీమకు నీరు అందిస్తామని నారాలోకేష్ రోడ్‌షోలో స్పష్టం చేశారు. అలాగే రాయలసీమ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా మంచినీరు అవసరమన్నారు. అలాంటి నీరు లేక ఈ ప్రాంతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని మొసలి కన్నీళ్లు కార్చారు. ఎన్ని వందల కోట్లు ఖర్చు అయినా ప్రభుత్వం భరించి, పట్టిసీమ నుంచి ఎత్తిపోతలతో నీటిని రాయలసీమ ప్రాంతాలకు తీసుకువస్తామని ఆర్భాటంగా ప్రకటించి వెళ్లారు. అవి ఇప్పటికీ కార్యరూపం దాల్చక పోవడం గమనార్హం!

వైఎస్సార్‌సీపీ పాలనలోనే ప్రాజెక్టులు

కరువుకు కేరాఫ్‌గా నిలిచిన రాయలసీమలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముదివేడు రిజర్వా యర్, పుంగనూరులోని నేతిగుట్లపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్లకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అనుమతులు ఇచ్చారు. సుమారు రూ.2.500 కోట్లతో పనులు చేపట్టారు. అంతేకాకుండా వేలాది కోట్లు ఖర్చు చేసి, పుంగనూరు నియోజకవర్గాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేశారు. అయితే రిజర్వాయర్లకు సంబంధించి ప్రాజెక్టు పనులు ప్రారంభించే సమయంలో తెలుగుదేశం పార్టీ గ్రీన్ ట్రిబ్యునల్‌లో స్టే తీసుకొచ్చి ఆ పనులు ఆపివేశారు. నారా లోకేష్ మాటలకు, తమ్ముళ్ల చేతలకు పొంతనలేకుండా పోయింది. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి కూటమి ప్రభుత్వంగా వచ్చి 7 నెలలు కావస్తున్నా అభివృద్ధి జాడే లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌కో ఏఈగా ప్రసాద్



బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె ట్రాన్స్‌కో ఏఈగా సోమవారం ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ హేమచంద్రుడు బంగారుపాళ్యంకు బదిలీ కావడంతో పుంగనూరు డివిజనల్ ఆఫీస్‌లో జేఈగా పనిచేస్తున్న ప్రసాద్‌ను ఉద్యోన్నతిపై బైరెడ్డిపల్లెకు బదిలీ చేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

సంక్షేమ కార్యదర్శికి ప్రశంసా పత్రం



డీడీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న భారతి

బైరెడ్డిపల్లె / చౌడేపల్లె: బైరెడ్డిపల్లె సచివాలయం -1 సంక్షేమ కార్యదర్శి భారతి విధి నిర్వహణలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా గణతంత్ర దినోత్సవం రోజున డిప్యూటీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. సోమవారం సచివాలయంలో సిబ్బంది ఆమెను సత్కరించారు.



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న చౌడేపల్లె హాస్టల్ వార్డెన్ బి.సురేష్‌బాబు

ఎంపీ, ఎమ్మెల్యేల చొరవతో తీరిన తాగునీటి సమస్య



మారుతివారిపల్లెలో వేస్తున్న తాగునీటి బోరు

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి , పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో సదుం మండలం జోగివారిపల్లె గ్రామ పంచాయతీ మారుతివారి పల్లెలో తాగునీటి సమస్య తీరింది. వివరాలు.. మారుతివారిపల్లెలో తీవ్ర తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో సర్పంచ్ అనితాకుమారి ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి పది రోజుల క్రితం తీసుకెళ్లారు. దీంతో ఎంపీ స్పందించారు. ఇచ్చిన హామీ మేరకు నిధులను మంజూరు చేయించారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం రాత్రి బోరు డ్రిల్లింగ్ చేశారు. బోరులో సుమారు రెండున్నర ఇంచీల నీరు పడింది. ఎంపీ, ఎమ్మెల్యేకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌కో ఏఈగా ఉమామహేశ్వరరావు



ఉమామహేశ్వరరావు

పుంగనూరు: పట్టణ ట్రాన్స్‌కో ఏఈగా ఉమామహేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డివిజన్ కార్యాలయంలో జేఈగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఏఈగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పరిశ్రమలకు స్వర్గధామంగా ఏపీ : ఎమ్మెల్యే



పలమనేరు: దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల స్థాపనకు స్వర్గధామంలా మారిందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనకు వెళ్లి రావడంపై సోమవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దావోస్‌లో ఏపీ సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచిందని, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు, లోకేష్ ఎంతో కష్టపడుతున్నారని చెప్పుకొచ్చారు. యాభైకి పైగా కంపెనీలు ఏపీలోకి రావడానికి లోకేష్ కష్టపడిన యువగళమే కారణమని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వ భూములు ఆక్రమించరాదని చిత్తూరు అర్బన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు నగరం ఇరువారం ప్రాంతంలో ఆక్రమణ భూమిని సోమవారం తొలగించారు. ఈ భూమిని పీఆర్ ట్రైనింగ్ సెంటర్, ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణానికి కేటాయించినట్లు ఆయన తెలిపారు. 1.2 ఎకరాల భూమిని ట్రైనింగ్ సెంటర్‌కు, 50 సెంట్లు ఈఎస్ఐ ఆస్పత్రికి కేటాయించామని ఆయన పేర్కొన్నారు. ఈ భూముల్లో ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని అర్బన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ హెచ్చరించారు.

పడితే అంతే..!

- బస్సులో ఫుట్ బోర్డుపై విద్యార్థుల ప్రమాద ప్రయాణం



ఫుట్ బోర్డుపై వేలాడుతూ ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

గంగవరం: బస్సుల్లో ఫుట్ బోర్డుపై ప్రయాణం ప్రాణాలతో చెలగాటమేనని అధికారులు హెచ్చరిస్తున్నా విద్యార్థులు పెడచెవిన పెడుతున్నారు. బస్సుల్లో ఖాళీ లేకపోయినా ఇంటికి త్వరగా చేరుకోవాలనే ఆత్రుతతో ఇలా..వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ప్రైవేట్ బస్సులు గొర్రెల దొడ్డిలా ప్రయాణికులతోపాటు విద్యార్థులను కుక్కి ఇలా రోడ్డు మీద దూసుకుపోతున్నాయి. ఎంత గట్టిగా పట్టుకున్నా బస్సు ఏ టర్నింగ్‌లోనో, ఓవర్‌టేక్ చేసే సమయంలోనే విద్యార్థులు పట్టు తప్పి కింద పడితే ఇక ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇలా వెళ్తున్న ప్రైవేటు బస్సులకు రవాణా అధికారులు కళ్లెం వేయాల్సి అవసరం ఉంటోంది. విద్యార్థులు ఇలా వేలాడుతూ జీవితాలను ఫణం పెట్టి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉంది.

నాదం.. మోదం



కాణిపాకం: కాణిపాకంలోని దేవస్థాన ఆస్థాన మండపంలో సోమవారం త్యాగరాజస్వామి కచేరి భక్తులను అలరించింది. నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కచేరికి జిల్లా నలుమూలల నుంచి కళాకారులు హాజరై వీనులవిందుగా కచేరి నిర్వహించారు. కళా వాయిద్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఈవో పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ర్యాంకర్స్ పాఠశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని ర్యాంకర్స్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి అన్నారు. మిట్టూరులోని ఆ పాఠశాలలో సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలా మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించకపోవడం వల్లే ప్రమాదాలకు లోనవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల డైరెక్టర్ జయశ్రీ, రిటైర్డ్ ఎంఈవో రామ్మూర్తి నాయుడు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ, నీట్‌పై అవగాహన సదస్సు



అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ శ్రీఫణిని సన్మానిస్తున్న దృశ్యం

కుప్పం: పదవ తరగతి పూర్తయి ఇంటర్‌కు వచ్చే విద్యార్థులకు ఆల్ ఇండియా జేఈఈ (మెయిన్స్ / అడ్వాన్స్‌డ్), నీట్ ప్రవేశ పరీక్షలల్లో ఉత్తీర్ణత సాధించడంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు కుప్పం ఐఆర్ఎం విద్యాసంస్థల అధినేత బీఎం. దయానిధి తెలిపారు. తిరుపతికి చెందిన అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ డాక్టర్ శ్రీఫణి విద్యార్థులు పలు అంశాలపై సలహాలు-సూచనలు ఇచ్చారు. రానున్న రోజుల్లో ఎస్వీ గ్రూప్ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల అకడమిక్ ప్రతిభను గుర్తించడానికి క్యాట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.లక్ష్మీదేవి, డాక్టర్ అరుల్ రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. మొత్తం 35మంది విద్యార్థులు రక్తదానం చేశారు. పలమనేరు ఏరియా ఆసుపత్రి వైద్యులు, కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుప్పానికి అదనంగా మద్యం షాపు

కుప్పం: కుప్పం నియోజకవర్గానికి అదనంగా మద్యం షాపు మంజూరైనట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ నాగరాజు తెలిపారు. ప్రధానంగా ఈడిగ సామాజిక వర్గానికి ఈ షాపును ప్రభుత్వం కేటాయించిందని, ఈడిగ కులస్తులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థి నిబంధనల ప్రకారం కుల ధ్రువీకరణ పత్రం, స్వగ్రామం సర్టిఫికెట్లతో పాటు రూ.2 లక్షల డీడీని దరఖాస్తుకు జతచేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

శివాడిలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని శివాడిలో పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి మురళి సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జమున, ఏఎన్ఎం సుశీల, ఆశా వర్కర్ ఉమ పాల్గొన్నారు.

మాకు పథకాల ఫలాలేవీ?

- తహసీల్దార్‌కు సంచార జాతుల కులాలు నివేదన'



తహసీల్దార్ బాబుకు వినతిపత్రం ఇస్తున్న సంచార జాతుల సంఘం నేతలు

రామకుప్పం: ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు మండలంలోని సంచార జాతులకు చెందిన కులాలకు అందేలా చూడాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ బాబుకు ఆ కుల సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. బీసీ వర్గానికి సంబంధించి అత్యంత వెనుకబడిన 32 సంచార కులాల వారిని మండలంలో గుర్తించేందుకు సీడ్ సర్వే నిర్వహించాలని సంచార జాతుల మండల అధ్యక్షుడు వెంకటాచలపతి డిమాండ్ చేశారు. సంచార జాతుల ఆర్థిక స్థితిగతులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి తద్వారా ప్రభుత్వం నుంచి పథకాల ఫలాల లబ్ధి తమకు చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో సంచార జాతుల సంఘం నేతలు సుబ్రి, నాగరాజు, రమేష్, రాజప్ప, బయప్ప, మధు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన మంగళపల్లె విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హిందీ ప్రతిభా పరీక్షల్లో మంగళపల్లె విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సోమవారం హెచ్ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. భారత దేశ జాతీయ హిందీ భాషా ప్రచారంలో భాగంగా గత ఏడాది నవంబరులో ప్రొద్దుటూరుకు చెందిన దశమంద విద్యాసేవాసదన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో హిందీ ప్రతిభా పరీక్షలు నిర్వహించారన్నారు. పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. 18 మంది విద్యార్థులు పరీక్షలో సత్తాచాటారని చెప్పారు. పాఠశాలకు చెందిన సిరి, కావ్య బంగారు పథకాలు సాధించగా, చాణక్య, శాంతిప్రియ వెండి పథకాలు సాధించారని వివరించారు. మిగిలిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించి సర్టిఫికెట్లు పొందారని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించేందుకు కృషి చేసిన హిందీ ఉపాధ్యాయురాలు భారతి హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌శివప్రసాద్, ఉపాధ్యాయులు సంజీవి, పిళ్లారప్ప, సంపంగి, ప్రేమకృష్ణ, ధనశేఖర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మానవాళికి వెలుగు చూపిన అల్వా ఎడిసన్



బంగారుపాళెంలో ఎలక్ట్రీషియన్ డే నిర్వహించుకున్న ఎలక్ట్రీషియన్లు

బంగారుపాళెం: ప్రపంచ మానవాళికి వెలుగును ప్రసాదించిన మహనీయుడు థామస్ అల్వా ఎడిసన్ అని మండల ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ నాయకులు అన్సర్‌బాషా, గణపతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డేని మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రీషియన్స్ పతాకాన్ని ఎగురవేసి బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్‌కు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, థామస్ అల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనుగొని ప్రపంచంలోని అంధకారాన్ని తొలగిస్తూ వెలుగును అందించారని చెప్పారు. 2019 జనవరి 27వ తేదీ నుంచి ఎలక్ట్రీషియన్స్ డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఎలక్ట్రీషియన్లు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసులు, సుధీర్, ముబారక్, శేఖర్, పలువురు ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

పెరుగుతున్న చలి తీవ్రత

- మంచు దుప్పట్లో బైరెడ్డిపల్లె
- ఉదయం 8 గంటలైనా రాని వెలుతురు

బైరెడ్డిపల్లె: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పొగమంచు, చలితీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. పొగమంచు విపరీతంగా కురుస్తుండడంతో ఉదయం 8 గంటలైనా వెలుతురు రావడం లేదు. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న తరుణంలో చిన్న పిల్లలు, వృద్ధులు వ్యాధుల బారిన పడన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు చెప్పారు.



బైరెడ్డిపల్లెను కప్పేసిన పొగమంచు





ధర్మపురిలో చలిమంటలు వేసుకుంటున్న మహిళలు

వీరజవాన్‌కు ఎక్సైజ్ అధికారుల నివాళి



వీరజవాన్‌కు నివాళులర్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బంగారుపాళెం: ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన జవాన్ కార్తీక్‌ను దేశప్రజలు ఎన్నటికీ మరచిపోరని చిత్తూరు రూరల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ పురుషోత్తం అన్నారు. సోమవారం సిబ్బందితో కలసి మండలంలోని ఎగువరాగిమానుపెంట గ్రామంలో కార్తీక్ కుటుంబసభ్యులను పరామర్శించారు. వీరజవాన్ కార్తీక్ తల్లి సెల్వి, తండ్రి వరదరాజులు మండడి, సోదరుడు రాజేష్‌ను ఓదార్చారు. కార్తీక్ కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. అనంతరం రూ.10